## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్ల కొమ్మల తొలగింపు, పలు మరమ్మత్తు పనుల కారణంగా మంగళవారం ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని కింద తెలిపిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్ రెడ్డి తెలిపారు.

- ఉదయం 6 నుండి 8 గంటల వరకు మలక్‌పేట గంజ్, ప్రేమలతా కాలనీ, అజీజ్ పాషా, గంజ్ బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, చర్మాస్ ఆపోజిట్ లైన్, తలా మజీద్, రహ్మత్‌నగర్ పరిసర ప్రాంతాలు
- ఉదయం 8నుండి 10 గంటల వరకు ఎంసీహెచ్ కాలనీ, రేస్‌కోర్స్ రోడ్, లైబ్రరీ పీటీ, వాణీ స్కూల్, రైల్వేట్రాక్, 2 నెంబర్ గల్లీ, ఫతేష్ సిద్ధిక్ మజీద్, నిజాం హోటల్, గౌసియా స్కూల్, ఖాన్‌నగర్ నాలా పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని డీఈ తెలిపారు.

చంపాపేట: విద్యుత్ సంబధ మరమ్మతు పనుల కారణంగా చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. దుర్గాభవానీనగర్ 33/11 కేవీ విద్యుత్ ఫీడర్‌ల పరిధిలో ఉదయం 7 నుంచి పది గంటల వరకు ఐఎస్‌సదన్, డీఎస్‌నగర్, సెంట్రల్ ఎక్సేంజ్, ఈస్ట్ మారుతీనగర్, యాదగిరినగర్, దుర్గాభవానీనగర్ కాలనీలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు.

### రైతు బజారులో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతు బజారుల్లో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో) టమాట 35, వంకాయ 28, బెండ 40, పచ్చి మిర్చి 55, కాకర 38, బీర 35, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 85-125, క్యారెట్ 53, దొండ 28, చిక్కుడు 85, గోకర 40, బీట్‌రూట్ 23, క్యాప్సికం 55, ఆలు 20, దోస 15, సొర 13, పొట్ల 13, ఉల్లి 16, చామగడ్డ 35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

### గిరిజన బంధు అమలు చేయాలి

దిల్‌సుఖ్‌నగర్: గిరిజనులకు గిరిజన బంధును తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో అమలు చేస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16న ఎల్‌బీనగర్‌లోని అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి రామావత్ పాండు నాయక్, జిల్లా ఉపాధ్యక్షులు మూడవత్ గోపి నాయక్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు గిరిజన బంధును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### క్రీడలతో మానసికోల్లాసం

నాగోలు: చిన్నారులు క్రీడల్లో రాణించాలని తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. జైపురికాలనీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో సోమవారం జైపురికాలనీలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ.. చిన్నారులు వేసవి కాలంలో సమయం వృథా చేయకుండా క్రీడల్లో రాణించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. జైపురికాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్యామల యాదగిరి, కోచ్ లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

# స్ఫూర్తిని ప్రతిబింబించేలా దశాబ్ది ఉత్సవాలు



తెలంగాణ 5కె రన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


రన్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, పోలీసు అధికారులు, యువకులు

**ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**

చైతన్యపురి: తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర అవతరణ స్ఫూర్తిని ప్రతిబింబించేలా ప్రభుత్వం 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తుందని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో బాగంగా రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఎల్‌బీనగర్ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం గడ్డిఅన్నారం డివిజన్ పీఅండ్‌టీ కాలనీ చౌరస్తా నుంచి ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వరకు తెలంగాణ 5కె రన్ నిర్వహించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌తో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని రన్ ప్రారంభించారు. చిన్నారులు, యువత, పోలీసు అధికారులు, సిబ్బంది, జీహెచ్‌ఎంసి ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో దేశంలోనే తెలంగాణ పోలీసులకు ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ స్టేషన్‌ల ఇన్‌స్పెక్టర్లు అంజిరెడ్డి, జానకిరెడ్డి, జీహెచ్‌ఎంసి డిప్యూటి కమిషనర్లు కృష్ణయ్య పాల్గొన్నారు.

## కామినేనిలో అడ్వాన్స్‌డ్ న్యూరో సైన్స్ సెంటర్ ప్రారంభం


కామినేని హాస్పిటల్స్‌లో అడ్వాన్స్‌డ్ న్యూరో సైన్స్ సెంటర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైద్యులు

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్ కానినేని హాస్పిటల్స్‌లో అడ్వాన్స్‌డ్ న్యూరో సైన్స్ సెంటర్‌ను హాస్పిటల్ న్యూరాలాజీ వైద్య బృందం హాస్పిటల్‌లోని ఇందిరా ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సోమవారం బ్రోచర్‌ను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూరోలజీ డాక్టర్లు డా. ఎం ఎ, జలీల్, డా. నవీన్ కుమార్‌లు మాట్లాడుతూ మానవ శరీరంలో మెదడు, వెన్నుపూస, నాడీ వ్యవస్థ అత్యంత ముఖ్యమైనవని, మెదడు, నరాలు, కండరాలకు సంబంధించిన వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పక్షవాతం, మూర్ఛవ్యాధి, స్పాండిలోసిస్, మెదడులో కణతులు, ప్రమాదాలు, మెదడువ్యాపు, మానసిన వ్యాధులు, నరాల వ్యాధుల బారీన ప్రజలు పడుతన్నారని, వీటిన్నటినీ ఒకే గొడుగు కింద చికిత్సను అందించేందుకు కామినేని హాస్పిటల్స్‌లో అడ్వాన్సుడ్ న్యూరో సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు వివరించారు.

తెలుగు రాష్ట్రాల్లో ప్రప్రథంగా పూర్తి స్థాయి జెనెటిక్స్ ల్యాబ్ ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్స్‌లో అందుబాటులో ఉందని తెలిపారు. జన్యుపరమైన కారణాలను గుర్తించడం, జన్యు సంబంధిత వ్యాధుల బారీన పడకుండ కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్. రమేష్, డాక్టర్ బౌమిక్ చూడాసామ, డాక్టర్ కమలేష్ ఎం చొడ పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యం


పార్టీలో చేరిన యువకులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీకి చెందిన సుమారు వంద మంది యువకులు ఆదివారం రాత్రి బీఎన్‌రెడ్డినగర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ చేరారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాల నాయకులు ప్రజా సంక్షేమాన్ని మరిచి నాపై విమర్శలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు కుంట్లూర్ వెంకటేశ్‌గౌడ్, అనిల్ చౌదరి,కల్యాణ్ పాల్గొన్నారు.

## రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి


పోస్టర్ విడుదల చేస్తున్న చేస్తున్న శ్రీనివాస్

మలక్‌పేట: ఈనెల 18న నిర్వహించనున్న రాజీవ్ గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలలో పాల్గొనాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ విద్యార్థులను కోరారు. సలీంనగర్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్‌లలో ఇంటర్, డిగ్రీ కాలేజీలలో సోమవారం క్విజ్ పోటీలపై ప్రచారం చేశారు. విద్యార్థులతో కలిసి 'ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్'ను విడుదల చేశారు. క్విజ్ పోటీలలో పాల్గొనదలచి వారు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 17 తేదీలోగా తమ పేరు నమోదు చేయించుకోవాలన్నారు. ఆసక్తి కలిగిన వారు 7661 899 899 సెల్ నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వాలని కోరారు.

## నాలా పూడికతీత పనులు వేగవంతం చేయాలి


నాలా పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని నాలాల పూడిక తీత పనులు వేగవంతం చేయాలని గడ్డిఅన్నారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లో జరుగుతున్న నాలా పూడిక తీత పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ డివిజన్‌లోని కాలనీలు సరూర్‌నగర్ చెరువు లోతట్టులో ఉండటం వల్ల, చెరువు నుంచి వచ్చే వరదనీరు చెత్తతో కూడి రావటం వల్ల నాలాలు పూడుకు పోయి రహదారులపైకి పొంగిన వరద నీరు ఇండ్లలోకి ప్రవహిస్తుందని అన్నారు. చెరువు ఔట్ ఫ్లో వద్ద ధృడమైన జాలీ ఏర్పాటు చేసి నాలాలోకి చెత్త రాకుండా చూడాలన్నారు.

## నేడు మహిళా భద్రతపై అవగాహన సదస్సు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడి యంలో దశాబ్ది ఉత్సవాలలో బాగంగా మంగళవారం ఉదయం 10 గంటలకు మహిళా భద్రతపై మహిళా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్‌కుమార్ తెలిపారు. ముఖ్య అతిథిగా మంత్రి పి. సబితా ఇంద్రారెడ్డి హాజరు కానున్నారన్నారు.

## సగరులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

బడంగ్‌పేట: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నగర సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం నిర్వహించిన సగర సంఘం సమావేశంలో.. అఖిలభారత సగర మహాసభ అధ్యక్షుడు శంకెట్టి విజేందర్‌సాగర్, జాయంట్ సెక్రెటరీ రాజేష్ ఎన్నికల పర్యవేక్షకులుగా వ్యవహరించారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ నగర సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ సాగర్, ఉపాధ్యక్షులుగా ఇంద్రాల వెంకటేష్‌సాగర్, వినోద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బి.శ్రీకాంత్ సాగర్, కోశాధికారి అనిల్‌సాగర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ముత్యాల వాసుసాగర్, వైస్ ప్రెసిడెంట్‌గా బాదం బాబురావు సాగర్, ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సభ్యులు మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సగరుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు ప్రవేశపెట్టాలని కోరారు. వెనుకబడ్డ సగరుల కుటుంబాలకు మేలు చేసేవిధంగా సగరుల సంక్షేమ నిధిని ఏర్పాటు చేడంతో పాటు సగరులకు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని నియోజకవర్గాలను కేటాయించి రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. సగరుల కుటుంబాలకు ప్రత్యేక బ్యాంకు రుణాలు అందజేయాలన్నారు.

## బాల కార్మిక వ్యవస్థను రూపుమాపాలి


కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఇందిర

హయత్‌నగర్: బడి ఈడు పిల్లు ఎవరూ పనుల్లోకి వెళ్ళరాదని, పిల్లలను పనుల్లో పెట్టుకున్న వారు చట్టపరంగా శిక్షార్హులని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఇందిర అన్నారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో బాల కార్మిక వ్యవస్థపై ఆమె విద్యార్థులకు అవగాహన కల్పించారు. దేశంలో అనాదిగా బాల కార్మిక వ్యవస్థ వేళ్ళూనుకుపోయిందని, బాలలను పని బారం నుంచి విముక్తి చేయడానికి అనేక చట్టాలను అమలు చేస్తున్నామన్నారు. 14 ఏళ్లలోపు పిల్లలకు చదువుకునే హక్కు ఉందని వారిని బలవంతంగా పనుల్లో పెడితే వారు శిక్షార్హులవుతారని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రామ్మోహన్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ్మా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు పరిశీలించిన కార్పొరేటర్


అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో ప్రారంభించిన అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని స్థానిక డివిజన్ కార్పోరేటర్ వంగ మధుసూధన్‌రెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం ఆయన కర్మన్‌ఘాట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ 35 లక్షల నిధులతో మన బస్తీ మన బడి పథకం ద్వార ప్రారంభించిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మధుసూధన్‌రెడ్డి మాట్లాడుతూ...ప్రభుత్వ పాఠశాలలో విద్య నభ్యసించే చిన్నారులకు మౌళిక వసతులు కల్పించేందుకే అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పద్మ, గణేష్, భూషణ్, కృపాకర్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు


కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ రంగానర్సింహగుప్త

చైతన్యపురి: డివిజన్‌లోని కాలనీలలో అవసరమైన ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయనున్నట్లు చైతన్యపురి కార్పొరేటర్ రంగా నర్సింహగుప్త అన్నారు. మారుతీనగర్, సత్యనారాయణ పురం కాలనీలో అధికారులతో కలిసి కార్పొరేటర్ పర్యటించారు. రహదారి పక్క ఇండ్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కొట్టివేయించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కాలనీల ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అవసరమైన పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసి, ఎలక్ట్రికల్ అధికారులు సాయికుమార్, శ్రీకాంత్, జంగయ్య, కాలనీ వాసులు కృష్ణమూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వివిధ రకాల అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఆయా శాఖల అధికారులు పర్యవేక్షించాలని కార్పొరేటర్ జంగం శ్వేతమధుకర్‌రెడ్డి సూచించారు. సోమవారం ఐఎస్‌సదన్‌లోని బృందావన్ కాలనీలో సీసీరోడ్డు పనులను కార్పొరేటర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, డివిజన్‌లోని ప్రధాన రహదారులతో పాటు కాలనీలలోని అంతర్గత రహదారులను సైతం ఆధునీకరించేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. డివిజన్‌లో పలుచోట్ల తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్ పనుల నిర్మాణాలు సాగుతున్నాయని, అవి పూర్తయిన చోట వెంటనే రహదారులు నిర్మిస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, జంగారెడ్డి, నరసింహారెడ్డి, రఘునాథ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కేసీఆర్‌దే


హస్తినాపురంలో కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న సత్యంచారి

హస్తినాపురం: పేద ప్రజల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి వాటిని అమలు పరిచిన ఘనత ముఖ్యమంత్రి కేసిఆర్‌కే దక్కిందని హస్తినాపురం డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి అన్నారు. సోమవారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషిమాత కాలనీలోని దివ్యాంగుల వసతిగృహం ఆవరణలో దివ్యాంగులతో కలిసి సత్యంచారి సీఎం కేసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సత్యంచారి మాట్లాడుతూ దివ్యాంగులు తలెత్తుకుని తెలంగాణ రాష్ట్రంలో జీవించే విధంగా వారి పెన్షన్‌ను 3016నుండి 4016 రూపాయలకు పెంచారని అన్నారు.

## ఘనంగా పోచమ్మ మాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు


ఉత్సవాలల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ తదితరులు

నాగోలు: నాగోలులోని పోచమ్మ దేవాలయంలో పోచమ్మ మాత విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు - ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా తెలంగాణ రాష్ట్ర కురుమ విద్యార్థి హాస్టల్ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షులు యెగ్గె మల్లేశంను కురుమ గ్రామస్తులు గొంగడి, రుమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# వారం రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

- జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్
- ఉత్సవాల నిర్వాహకులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో జోనల్ కమిషనర్ సమీక్షా సమావేశం
- ఆషాఢమాసం బోనాలకు ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు


సమీక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ ఆలయాల ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ అధికారులు

చార్మినార్: ఈసారి పాతబస్తీలో జరిగే ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను పురస్కరించుకొని రాబోయే వారం రోజుల్లో ఆయా ఆలయాల వద్ద అభివృద్ధి పనులు ప్రారంభమవుతాయని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ నామా సామ్రాట్ అశోక్ స్పష్టం చేశారు. ఈ మేరకు సంబంధిత కాంట్రాక్టర్లు ఆయా పనులను వారం రోజుల్లో ప్రారంభించకపోతే తగిన చర్యలు తీసుకుంటామని.. ఆ పనులను క్యాన్సిల్ చేసి మరో కాంట్రాక్టర్‌కు అప్పగిస్తామని ఆయన హెచ్చరించారు. మహంకాళి జాతర బోనాల ఉత్సవాలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేస్తామన్నారు. రానున్న బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని జోనల్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఆయన భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌తో పాటు పలు ఆలయాల కమిటీ ప్రతినిధులు, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పలు ఆలయాల వద్ద నెలకొన్న సమస్యలను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ఆలయ కమిటీ నిర్వాహకులు సమావేశంలో జోనల్ కమిషనర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ సామ్రాట్ అశోక్ మాట్లాడుతూ.. అన్ని ఆలయాల వద్ద అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జూలై 16న బోనాల పండుగ రోజు బోనాలు సమర్పించే ఆలయాల వద్ద రోడ్లకు మరమ్మతులు చేయించి బలిగంప నిర్వహించే ప్రాంతాల్లో తాత్కాలిక వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రధానంగా ఉత్సవాలు నిర్వహించే ఆలయాలతో పాటు జూలై 17న అమ్మవారి సామూహిక ఘటాల ఊరేగింపు కొనసాగే దారిలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తామన్నారు. తాము నిర్వహించే అభివృద్ధి పనులకు ఆలయాల కమిటీ ప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో మలక్‌పేట్, సంతోష్‌నగర్, చాంద్రాయణగుట్ట, చార్మినార్, ఫలక్‌నుమా, రాజేంద్రనగర్ సర్కిళ్ల ఈఈలు, డీఈలు, ఏఈలు, ఎలక్ట్రికల్ విభాగం డీఈలు, ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ సభ్యులు, దేవాలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకే పోస్టర్ల చించివేత

- జీజేపీ నేతల తీరుపై బీఆర్‌ఎస్ నాయకుల ఫైర్


మాట్లాడుతున్న లక్ష్మయ్య యాదవ్

తుక్కుగూడ: బీజేపీ నాయకులు ప్రభుత్వం వేసిన పోస్టర్లను మాత్రమే చింపివేయగలరు... కానీ బీఆర్‌ఎస్ మీద ప్రజల్లో ఉన్న ప్రేమను మాత్రం చెరపలేరు అని తుక్కుగూడ మున్సిపల్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్య యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాలలో ఆపార్టీ కౌన్సిలర్లు, నాయకులతో కలిసి ఆయన మాట్లాడుతూ... తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అధికారులు మున్సిపాలిటీ వ్యాప్తంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను బీజేపీకి చెందిన కౌన్సిలర్లు చింపివేయడం విచారకరమన్నారు. ప్రజాప్రతినిధి హోదాలో ఉండి ప్రభుత్వ ప్రచారం అడ్డుకోవడం తగదన్నారు. తుక్కుగూడ మున్సిపల్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులు వివరాలను తెలియజేయాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం మంత్రి సబితారెడ్డి చేస్తున్న పనితీరుని చూసి ఓర్వలేక బీజేపీ కౌన్సిలర్లు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారన్నారు. ఇప్పటికైన ఇలాంటివారు తమ బుద్ధిని మార్చుకొని మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ కౌన్సిలర్లు రవినాయక్, నాయకులు బూడిద శ్రీకాంత్, శ్యామేల్ రాజు, బాట సురేష్, శివశంకర్, వెంకటరాజీరెడ్డి, సురేష్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.